# రాజయ్య తెలివితేటలు

ఒకసారి రాజయ్యకు ఓ ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది. అందులో "ఏయ్ రాజయ్యా, నువ్వు కోళ్లను దొంగతనం చెయ్యటం మానకపోతే, ఆ కారణంగా నీ ప్రాణాలమీదికి తెచ్చుకుంటావు - జాగ్రత! ఏమాత్రం నీకు బ్రతకాలని కోరికవున్నా, కోళ్లను దొంగలించడం మానేయాలి!

ఇట్లు

నీ శ్రేయోభిలాషి...

ఈ ఉత్తరం చూసి రాజయ్య ఆశ్చర్యపోయి, వెర్రి ఆవేశంతో వెనువెంటనే పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదుదాఖలు చేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆ ఉత్తరం చదివి, "అయితే, నీవు నీ నేరం ఒప్పుకుని లొంగిపోతున్నావా?" అన్నాడు. లేదన్నాడు రాజయ్య.

"అయితే దీన్ని గురించి మీ కెందుకింత ఆలోచన - ఆవేశం? నిశ్చితంగా ఉండండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్!

"నిశ్చితంగా ఎలా ఉండమంటారండీ? ఈ ఉత్తరం వ్రాసిందెవరో తెలిస్తేనేకదా-యింకముందయినా నేను కోళ్లను దొంగతనం చేయటం మాననా - వద్దా అన్న సమస్య తేలేది!!" అన్నాడు గంభీరంగా ముఖంపెట్టి.

రాజయ్య తెలివికి ఆశ్చర్యపోయాడు పోలీసు ఇన్‌స్పెక్టర్!

